క్లుప్తంగా

సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



శిక్షణ అందిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్డీ టీం సభ్యులు

నగరి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏఓ సతీష్ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఆర్డీ పరిశీలకులు ప్రసాద్, ప్రత్యేక టీం సభ్యులు శిక్షణ అందించారు. ఎస్‌డబ్ల్యూపీసీ, జీపీడీపీ, వీధి దీపాల నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలను విశదీకరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీలు లక్ష్మీపతి, అరుణ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మన బడి.. అందరి బాధ్యత



డీఎం పురం పాఠశాలలో మానవహారం

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేశవులు అన్నారు. గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రభుత్వ బడిలో చదివే విధంగా తల్లిదండ్రులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం యాజమాన్య కమిటీ ఎన్నికలను సజావుగా నిర్వహించారు. చైర్మన్‌గా ఎం.త్యాగరాజు, వైస్ చైర్మన్‌గా బి.సంధ్య ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ సభ్యులతో మానవహారం ఏర్పాటు చేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కార్వేటినగరం: పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని ఏడీఏ నాగపద్మిని అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆర్కేవీబీపేట గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ నాగపద్మిని మాట్లాడుతూ వేరుశనగ పంటల్లో కలుపు నివారణ, కాండం తొలిచే పురుగులు, ఆకు ముడత రోగాల నివారణకు సలహాలు ఇచ్చారు. అనంతరం రైతులు సాగు చేసిన వేరుశనగ పంటలను పరిశీలించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ హేమలత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సబిత, నళిని, ఏఈఓలు గాయత్రి, హేమాద్రి, రైతు భరోసా సిబ్బంది మునికృష్ణ, సుమ, కుసుమ, కల్పన పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో ద్రౌపది అమ్మవారు

నగరి: చింతలపట్టెడ ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న తిరునాళ్లలో భాగంగా గురువారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని కుంకుమ, ప్రసాదాలు స్వీకరించారు. రాత్రి ప్రత్యేక రథంపై శ్రీకృష్ణుని ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపుగా వచ్చిన శ్రీకృష్ణునికి ప్రతి ఇంటి వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉత్సవ నిర్వాహకులు డాక్టర్ నటరాజన్ భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రవితేజ

పాలసముద్రం: రైతు భరోసా కేంద్రంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షకు విశేష స్పందన లభించిందని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి నుంచి వచ్చి వైద్యుడు రవితేజ రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఆపరేషన్ చేయడానికి ఎంపిక చేశారు. మొత్తం 121 మందికి 52 మందికి కంటి పొర ఆపరేషన్ల ఎంపిక చేసుకున్నారు. వారిని సొంత వాహనంలోనే తిరుపతి తీసుకెళ్లి ఆపరేషన్ చేసి, స్వగ్రామానికి తీసుకొస్తారని తెలిపారు. ఉచితంగా మందులు కూడా అందిస్తామని తెలిపారు. సబ్సిడీలో కంటి అద్దాలు పంపిణీ చేయనున్నారు.

కామధేనువుపై శ్రీకృష్ణుని విహారం

పుత్తూరు: శ్రీద్రౌపదీ దేవి సమేత శ్రీధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణభగవానుడు కామధేనువుపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పండరి భజనలు, కోలాటాల తోపాటు బాణాసంచా నడుమ పాండవులు ముందు వెళ్తుండగా శ్రీరుక్మిణీ సత్యభామ సమేతుడైన శ్రీకృష్ణుడు వెనక కామధేనువుపై పట్టణ పురవీధుల్లో విహరించారు. ఉదయం 6 గంటలకు ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివార్లకు ప్రత్యేక అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ద్రౌపదీదేవి జన్మస్థలమైన చౌటూరు గ్రామానికి ఊరేగింపుగా పయనమై వెళ్లారు.

తిరునాళ్లకు సర్వం సిద్ధం

పుత్తూరు శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఇక్కడి బ్రహ్మోత్సవాలు మహాభారతానికి ఆనవాలుగా నిలుస్తున్నాయి. ఏటా శ్రావణ మాసంలో జరిగే ధర్మరాజుల ఆలయ బ్రహ్మోత్సవాలే పుత్తూరు తిరునాళ్లుగా ప్రసిద్ధికెక్కాయి. దక్షిణ భారత దేశంలోని ధర్మరాజుల స్వామి ఆలయాల్లో ఎక్కడా లేనివిధంగా 45 అడుగుల చుట్టు కొలత, 40 అడుగుల ఎత్తు కలిగిన భారీరథం ఇక్కడ ప్రత్యేకం. 10 రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో అర్జున తపస్సు, మహారథోత్సవం, అగ్నిగుండ ప్రవేశం తలమానికంగా నిలుస్తాయి. శుక్రవారం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శతాబ్దాలుగా ఇక్కడ జరుగుతున్న అగ్నిగుండ ప్రవేశం అమ్మవారి సత్యశీలతకు నిలువెత్తు నిదర్శనంగా భక్తులు విశ్వసిస్తారు. – పుత్తూరు

- నేడు ధ్వజారోహణంతో ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద రథం కలిగిన ఆలయం
- అర్జున తపస్సు, రథోత్సవం, అగ్నిగుండం ప్రధాన ఘట్టాలు
- తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తుల రాక



ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయం

పుత్తూరు పట్టణంలోని శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోనే పుత్తూరు బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నెల 16న వరలక్ష్మీవ్రతం రోజున అర్జున తపస్సు నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం ఉత్తర గోగ్రహణ ఘట్టాన్ని నిర్వహించనున్నారు. ఆదేరోజు రాత్రి స్థానిక రైల్వే స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపును పురస్కరించుకొని పెద్ద ఎత్తున బాణాసంచా కాలుస్తారు. అనంతరం పాటకచేరీ, రాత్రి 11 గంటలకు అలుగు ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ నెల 17న రథోత్సవం జరుగనుంది. కౌరవుల వధ అనంతరం పాండవులు విజయోత్సవంతో రథంపై పట్టణ వీధుల్లో ఊరేగడమే రథోత్సవ ఘట్టం. భారీ రథాన్ని పాండవులు అధిరోహించి పట్టణ వీధుల్లో ఊరేగుతారు. వేలాదిమంది భక్తులు రథోత్సవంలో పాల్గొనడం అత్యంత విశేషం. ఈ నెల 18న అగ్నిగుండ ప్రవేశ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు వేలాదిమంది భక్తులు క్యూకట్టి అగ్నిగుండ ప్రవేశం చేస్తారు.

ఆలయ ప్రాశస్త్యం

లభించిన ఆధారాల మేరకు విజయనగర సామ్రాజ్యం 17వ శతాబ్దంలో పతనం కావడంతో దక్షిణ భారతదేశంలో ఔరంగజేబు సైన్యం విజృంభించింది. వీరికి ఆర్కాడు నవాబు సైతం తోడుకావడంతో తమిళనాడులోని చెంగల్పట్టు ప్రాంతానికి చెందిన వారు పుత్తూరుకు వలస వచ్చారు. అలా వలస వచ్చిన వారిలో ఏడుగురు అన్నదమ్ములు ఉన్నారు. వీరు పొట్టకూటి కోసం పుత్తూరు సమీపంలోని చౌటూరు గ్రామంలో ఓ బావిని తవ్వే పనికి పూనుకున్నారు. బావి తవ్వకాల్లో వీరికి చెక్కతో చేయబడిన అమ్మవారి విగ్రహం దొరికింది. అన్నదమ్ములు అమ్మవారి బొమ్మకు పూజలు చేయడం ప్రారంభించారు. అన్నదమ్ముల్లో చిన్నవాడు అమ్మవారికి ఆలయం కట్టాలని సంకల్పించి, అమ్మవారి బొమ్మను బుట్టలో పెట్టుకొని గ్రామాల్లో తిరుగుతూ, కత్తితో శరీరంపై బాదుకొంటూ విరాళాల సేకరణ చేపట్టాడు. విషయం తెలుసుకొన్న కార్వేటినగరాన్ని పాలిస్తున్న సాశ్వరాజు విరాళాలు సేకరిస్తున్న వ్యక్తి చేతికి మరోకత్తిని ఇచ్చి బాదుకోమని పరీక్షించాడు. పరీక్షలో నెగ్గిన ఆ వ్యక్తిని ఏమి కావాలో కోరుకోమన్నాడు. దీంతో ఆ వ్యక్తి పుత్తూరులో అమ్మవారికి ఆలయం నిర్మించాల్సిందిగా కోరాడు. వైష్ణవ భక్తుడైన సాశ్వరాజు ఆలయాన్ని నిర్మించి ఇచ్చాడు. గ్రామస్తులు విరాళాలు పోగు చేసి 40 అడుగుల రథాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి పుత్తూరులో శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. భారతంలోని 18 పర్వాలకు అనుగుణంగా 18 రోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తారు. అందులో 10 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు.







అర్జున తపస్సుమాను వద్ద వరపడిన మహిళలు, భక్తజన సందోహంతో మహారథోత్సవం, అమ్మవారి సత్యశీలతకు నిదర్శనంగా అగ్నిగుండ ప్రవేశం(ఫైల్)

చెత్త నుంచి సంపదపై దృష్టి పెట్టాలి

పాలసముద్రం: గ్రామాల్లో పారిశుధ్యం, వీధిలైట్లు, చెత్త నుంచి సంపదపై సర్పంచ్‌లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రామనాథరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో గ్రామాల్లో పలు రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. పారిశుధ్య లోపం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామంలో వీధిలైట్లు వెలిగేటట్లు చూడాలని తెలిపారు. చెత్త సేకరణ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి వానపాము ఎరువులు తయారు చేసి రైతులకు తక్కువ ధరకు అందించాలని తెలిపారు. అప్పుడే పంచాయతీ ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మండల విస్తరణాధికారి రమేష్, అన్ని పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి పూజలు

నగరి: బైపాస్ కూడలి సమీపంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలు, భజనలు చేయడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. నందిని, వేలు ఆచారి, దాక్షాయణి, జయచంద్రారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి మురళి, భక్తులు కన్నప్ప, మునస్వామి, ఎల్లప్పరెడ్డి, రమేష్ బాబు, దుర్గాప్రకాష్ స్వామి పాల్గొన్నారు.

కేవీపురంలో పారిశుధ్య పనులు

విజయపురం: కేవీపురం పంచాయతీలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ రజిని, పంచాయతీ కార్యదర్శి మురళి వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్డుపై నిలిచి ఉన్న మురికి నీటిని తొలగించారు. అక్కడక్కడ ఆయిల్ బాల్స్ వేశారు. వీధుల్లో బ్లీచింగ్ చేశారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించారు.

డాక్టర్ శేఖర్ సేవలు అభినందనీయం



ప్రత్యేక ప్రతిభా వంతులకు విద్యా సామగ్రిని అందిస్తున్న దాతలు

కార్వేటినగరం: కత్తెరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు డాక్టర్ శేఖర్ సేవలు అభివందనీయమని మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయకుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో విద్యనభ్యసిస్తున్న ప్రత్యేక ప్రతిభావంతులకు డాక్టర్ శేఖర్ విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో విజయకుమార్ మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉపయోగపడే ఉపకరణాలను అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం దాత డాక్టర్ జె.శేఖర్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న విద్యార్థులతోపాటు ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులు కూడా పోటీ తత్వంతో విద్యనభ్యసించాలనే ఉద్దేశంతో వారికి విద్యా సామగ్రిని అందించామన్నారు. వారిని ఆప్యాయంగా చూసుకోవాలన్నారు. వారి అభిరుచుల మేరకు ప్రోత్సహిస్తే ఉన్నత స్థాయికి చేరుకుని శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. వారిని ఎవ్వరూ చులకన భావంతో చూడకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 మనోజ్‌కుమార్, భవిత సెంటర్ ఉపాధ్యాయులు సింధూజ, రేఖ, మీనాక్షి, కిషోర్, రవి, గణేష్, కార్తీక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఆరోగ్య పరీక్షలు

పుత్తూరు: మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని టాటా ఆసుపత్రి డాక్టర్ వెంకయ్య బాబు సూచించారు. గురువారం పుత్తూరు, వడమాలపేట మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లకు ఐసీడీఎస్, తిరుపతి టాటా ట్రస్ట్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మితాహారం, క్రమం తప్పని వ్యాయామం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని తెలిపారు. ప్రత్యేకించి మహిళలు తమ దైనందిన జీవితంలో ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధ పడుతున్నారని తెలిపారు. గొంతు, రొమ్ము, గర్భాశయం, నోటి క్యాన్సర్లపై అవగాహన కల్పించి, 100 మంది అంగన్‌వాడీలకు స్క్రీనింగ్ టెస్టులు చేయించారు. అలాగే బీపీ, షుగర్, హెపటైటిస్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ పద్మజ, సూపర్‌వైజర్లు గీతాంజలి, సంధ్య, అనిత, మనీలా, రోజారమణి, టాటా ట్రస్ట్ కో–ఆర్డినేటర్ రెడ్డికుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు ముద్దు.. డబ్బా పాలు వద్దు

నగరి: తల్లిపాలు ముద్దు.. డబ్బా పాలు వద్దు అంటూ చిత్తూరు రూరల్ లెప్రసీ రిహాబిలిటేషన్ ఆరోగ్య స్వచ్ఛంద సంస్థ వారు ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల దినోత్సవాల్లో భాగంగా వారు గ్రామ, గ్రామాన తల్లులకు, గర్భవతులకు అవగాహన కల్పించే విధంగా గురువారం కరపత్రాలు పంచుతూ, నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు రామచంద్రన్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. సీఆర్‌ఎల్‌ఆర్ ప్రధాన కార్యదర్శి ఎస్‌ఈ రాణి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

నగరి: ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని, మైనింగ్, మట్టి క్వారీలపై ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ ఉండాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, పట్టణ కార్యదర్శి వేలన్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ రవికుమార్‌ను కలిశారు. నగరిలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాని అరికట్టాలని, నగరి చుట్టుపక్కల ఉన్న క్వారీల్లో తనిఖీలు నిర్వహించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఇసుక అక్రమ రవాణాపై సీపీఐ పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు పెడచెవిన పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను అరికడతామని చెబుతున్నప్పటికీ నగరిలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. బాషా, విజయ్‌కుమార్, శేఖర్, రాజేంద్ర, మురళి, సిరావుద్దీన్, ఏసుదాసు, వరదరాజులు పాల్గొన్నారు.



నేత సంఘం నాయకులకు సత్కారం

నగరి: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరి మండలం మాంగాడు గ్రామానికి చెందిన చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కుప్పయ్య శెట్టి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీలు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. స్థానిక చేనేత కార్మికులు వారికి అభినందనలు తెలియజేశారు.

చెరకు సాగులో మెళకువలు పాటించాలి

విజయపురం: చెరకు సాగులో మెళకువలు తెలుసుకుంటే మంచి దిగుబడితోపాటు లాభాలు ఆర్జించవచ్చునని ఏడీ సౌభాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం ఆలపాకంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారులు చెరకు సాగును పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరకు నాట్లు వేసుకునేందుకు ముందు ఎకరానికి 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను సాళ్లలో వేసుకోవాలన్నారు. చెరకు ముచ్చెలు నాటిన మూడు రోజుల్లోపు నేలపై ఎకరానికి రెండు కిలోల అట్రాజిన్ కలిపిన రసాయనాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. చెరకు విత్తనాన్ని విత్తుకునే ముందుగా 10శాతం సున్నపు నీటిలో ఒక గంటపాటు ఉంచుకోవాలి. దీంతో మొలక శాతం, పంట నీటి ఎద్దడిని తట్టుకునే శక్తి పెరుగుతుందన్నారు. సాగు చేసే ప్రతి రైతు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. ఏవో రజని కుమారి, ఆర్టికల్ అధికారి లోకేష్ పాల్గొన్నారు.

నివాస ప్రాంతంలో ఇటుక బట్టీ

విజయపురం: గొల్లకండ్రిగ గ్రామ నివాస ప్రాంతంలో స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి ఏకంగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. ఇటుక బట్టీలకు వాడే మట్టి, సిమెంట్ రోడ్డు కనబడకుండా మూసేసింది. అంతే కాకుండా స్థానికులు వాడే నీరు, వర్షపు నీరు బయట వెళ్లడానికి వీలు లేకుండా బట్టీలు ఏర్పాటు చేశాడు. దీంతో చుట్టు పక్కల వర్షపు నీరు నిలిచి పాచిపట్టి ఉంది. ఇదేమి అని ప్రశ్నిస్తున్న ప్రజలు, అధికారులను ఆ వ్యక్తి బెదిరిస్తున్నట్లు తెలిసింది. ప్రజలు నివాసం మధ్య ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. అంతేకాకుండా ఆ చుట్టు పక్కల నివాసం ఉన్న వారు తరచూ జ్వరంతో ఆసుపత్రి పాలవుతున్నారు. ఇటుక బట్టీలు కాల్చేటప్పుడు దుమ్ము, పొగ గ్రామాన్ని కమ్మేస్తుందని, దీంతో ఊపిరితిత్తుల వ్యాధితో బాధ పడేవారు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటుక బట్టీలకు వాడే మట్టి సిమెంట్ రోడ్డుపై పేరుకుపోయింది. చిన్నపాటి వర్షానికి రోడ్డు బురదమయంగా మారుతుంది. అధికారులు బురదను తొలగించినా మళ్లీ మట్టి రోడ్డుపై చేరుతోంది. గ్రామ మధ్యలో ఇటుక బట్టీలను తొలగించి, నిర్వాహకులపై జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. లేకుంటే గ్రామ మొత్తం అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలవడం ఖాయమంటున్నారు.



గ్రామం మధ్యలోని ఇటుక బట్టీ

స్కూల్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం

పుత్తూరు: వడమాలపేట, పుత్తూరు మండలాల్లో గురువారం జరిగిన ఎస్‌ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలు దాదాపు అన్నీ ఏకగ్రీవంగా జరిగాయి. వడమాలపేటలో మొత్తం 42 పాఠశాలలకు గాను 41 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎంఈఓ తులసీరామ్ తెలిపారు. ఒక్కో పాఠశాల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు మరో 13 మందిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. పుత్తూరు మండలంలోని 80 పాఠశాలలకుగాను 65 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని ఎంఈఓ తిరుమలరాజు తెలిపారు. 15 పాఠశాలల్లో ఓటింగ్ (తల్లిదండ్రులు చేతులు ఎత్తడం) ద్వారా నిర్వహించి ఫలితాలు ప్రకటించినట్లు తెలిపారు.

ఎస్‌ఎంసీ ఎన్నిక వాయిదా

నింద్ర: కొప్పేడు దళితవాడలోని ప్రాథమిక పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక వాయిదా పడింది. కోరం ఉన్నప్పటికీ విద్యాశాఖాధికారి వాయిదా వేసినట్లు స్థానికులు తెలిపారు. కమిటీ ఎన్నికలు జరగగా అందులో 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఎన్నికైన కమిటీ సభ్యులతో 8 మంది కమిటీ సభ్యులు హాజరుకాగా అందులో ఏడుగురు వైఎస్‌ఆర్ సీపీ మద్దతు పలికినవారు ఉన్నారు. దీంతో విద్యాశాఖ అధికారులు ఉద్దేశ పూర్వకంగా ఎన్నికలను వాయిదా వేశారని నాయకులు ఆరోపిస్తున్నారు.

సజావుగా ఎస్‌ఎంసీ ఎన్నికలు

విజయపురం: ఎస్‌ఎంసీ ఎన్నికలు సజావుగా ముగిశాయి. మొత్తం 54 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎన్నికలు నిర్వహించారు.

ప్రశాంతంగా పాఠశాల కమిటీ ఎన్నికలు

గంగాధరనెల్లూరు: మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులుశెట్టి ఎస్‌ఎంసీ ఎన్నికలను తూగుండ్రం ఉన్నత పాఠశాలలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 103 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించామన్నారు. వీటిలో 55 పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించామని పేర్కొన్నారు. 48 పాఠశాలల్లో కమిటీ సభ్యుల చేతులు ఎత్తడం ద్వారా చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నామన్నారు. తూగుండ్రం ఉన్నత పాఠశాలలో కమిటీ చైర్మన్‌గా ఎంపికైన సుధాకర్‌ను కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు కలసి ఘనంగా సన్మానించారు. మండల తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అధికార బలం.. అత్యధికం ఏకగ్రీవం

నగరి: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన మేరకు గురువారం అన్ని పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన ఈ ఎన్నికలు రాజకీయ రంగు పులుముకున్నాయి. పాఠశాల అభివృద్ధిలో భాగంగా పార్టీలకు అతీతంగా నిర్వహించుకునే ఈ ఎన్నికల్లో కూడా పార్టీ నాయకుల జోక్యం కనిపించింది. దీంతో 87 పాఠశాలలకు నిర్వహించిన ఎన్నికల్లో 58 పాఠశాలలకు ఏకగ్రీవంగా కమిటీలు ఎంపికయ్యాయి. మిగిలిన 29 స్థానాల్లో ఎన్నికలు జరిగినా అవి తూతూమంత్రంగానే జరిగాయి.